క్లుప్తంగా


భాగ్యనగర్ 4వ లైన్‌లో నేడు విద్యుత్ అంతరాయం

ఒంగోలు సబర్బన్: నగరంలోని భాగ్యనగర్ 4వ లైన్‌లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఒంగోలు టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీ పాండురంగారావు తెలిపారు. ఆ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. భాగ్యనగర్ 4వ లైన్‌లో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డుపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను పక్కకు మార్చేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, రోడ్డుకు రెండు వైపులా ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీర్లమాన్యం ఏరియాలో...

ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డు పీర్లమాన్యం ఏరియాలో కూడా సోమవారం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పీర్లమాన్యంతో పాటు అరుణోదయకాలనీ, టీచర్స్ కాలనీ, సమతానగర్, శ్రీరామ్ కాలనీ, శ్రీకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



మద్దలకట్టలో ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ దేవత

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ల, పెద్దారవీడు గ్రామాల్లో గ్రామ దేవతలు పోలేరమ్మ, అంకాళమ్మ దేవతలకు ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయం వద్దకు చేరుకొని చుట్టూ తప్పెట్లు, మేళాలతో ఊరేగింపుగా ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత అమ్మవారికి జలాభిషేకం చేసిన అనంతరం పసుపు, కుంకుమ, పట్టు చీరలు, పూలు, గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. గుండంచర్ల గ్రామం సమీపంలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించారు.

వీధికుక్కలతో బెంబేలు



హౌసింగ్ బోర్డు కాలనీలో...



మామిడిపాలెంలో...

- ఒంగోలు నగరంలో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు
- వాహనాల వెంటపడుతుండటంతో ప్రమాదాలు
- రోడ్లపై తిరగాలంటే భయపడుతున్న చిన్నారులు, వృద్ధులు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది



గద్దలగుంటలో గుంపుగా రోడ్లపై తిరుగుతున్న కుక్కలు

ఒంగోలు సబర్బన్: నగరంలో వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా గుంపులు గుంపులుగా వీధికుక్కలు సంచరిస్తూ పాదచారులు, వాహనదారుల వెంటపడి దాడి చేస్తున్నాయి. ఐదు నుంచి పది కుక్కల వరకూ గుంపుగా తిరుగుతూ వాహనాల వెంటపడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు తప్పించుకునే ప్రయత్నంలో ఒక్కసారిగా వేగం పెంచి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. చివరకు కార్ల వెంట కూడా పరుగులు తీస్తూ వీధి కుక్కలు వెంటాడుతున్నాయి. వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు రోడ్లపై నడవడానికే భయపడుతున్నారు. భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు, మామిడిపాలెం, గద్దలగుంట, సుజాతనగర్, నిర్మల్ నగర్, వీఐపీ రోడ్డు, లాయర్ పేట, రామ్‌నగర్, సంతపేట, 60 అడుగుల రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, ట్రంకు రోడ్డు, కర్నూలు రోడ్డు ఇలా ఒక ప్రాంతంతో సంబంధం లేకుండా ఏ రోడ్డుపై చూసినా గుంపులు గుంపులుగా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తూ రెచ్చిపోతున్నాయి. ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించడంతో పాటు నగరంలో అనేక మందిపై దాడి చేయడంతో ఆస్పత్రుల పాలై అల్లాడుతున్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చిన్నపిల్లలపై వీధికుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన వీడియోలు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతుండటంతో వాటిని చూసి ఒంగోలు నగర ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడి పరిస్థితి కూడా అదేవిధంగా ఉండటంతో తమ పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు మాత్రం నిర్లక్ష్యపు మత్తు వీడటం లేదు. వీధికుక్కల కారణంగా ఏదైనా జరగాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ అధికారుల తీరుపై నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బూటకపు హామీలతో చంద్రబాబు నయవంచన



వైఎస్సార్ సీపీ తొర్రగుడిపాడు గ్రామ కమిటీతో మాజీ మంత్రి మేరుగు నాగార్జున



మేరుగు నాగార్జునను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ తొర్రగుడిపాడు గ్రామ కమిటీ సభ్యులు

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో చంద్రబాబు బూటకపు హామీలతో ప్రజలు నయవంచనకు గురయ్యారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మోసాలే మిగిలాయి మినహా ఇచ్చిన హామీలు అమలు చేయక ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. చీమకుర్తి మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో శనివారం రాత్రి బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం అనంతరం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామ కమిటీని ఎంపిక చేశారు. మేరుగు నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సర్పంచ్ యద్దనపూడి అంజమ్మ, ఎంపీటీసీ అత్యాల అంకయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షుడు యన్నం శేషురెడ్డి, చీదర్ల శేషు, ప్రధాన కార్యదర్శి పిన్నిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పాలపర్తి అన్వేష్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు కోటేశ్వరరావు, రైతు విభాగం మండల అధ్యక్షుడు నల్లూరి చంద్ర, వాకా అరుణ కోటిరెడ్డి, ఆర్‌టీఐ వింగ్ మండల అధ్యక్షుడు బొంతా సంతోష్, మండల నాయకులు కుంచాల రాంబాబు, యర్రగుంట్ల మోహన్, బొడ్డపాటి హరిబాబు, మాగులూరి ఇమ్మానేలు, బక్కా సుధాకర్, మంచా హరికృష్ణ, తెల్లమేకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తొర్రగుడిపాడు గ్రామ కమిటీ...

అధ్యక్షునిగా వేల్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా పెరుగు బసవయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొనికి సుబ్రహ్మణ్యం, తుల్లూరి ఆనంద్ బాబు, దగ్గు వెంకటేశ్వర్లు, యద్దనపూడి వెంకటేశ్వర్లు, మోరబోయిన శ్రీనివాసరావు, అడపా వెంకయ్య, బూత్ కన్వీనర్‌గా బత్తుల సుబ్బారావు, ఎస్సీసెల్ అధ్యక్షునిగా పులి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షునిగా జొన్నలగడ్డ కోటయ్య, బీసీ సెల్ అధ్యక్షునిగా పుచ్చకాయల తిరుపతయ్య, యూత్ విభాగం అధ్యక్షునిగా కొనికి నాగార్జున, రైతు విభాగం అధ్యక్షునిగా కోటు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షునిగా మంగమూరి యోగేశ్వరరావు, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా వేల్పుల గోవర్ధన్, ఉపాధ్యక్షునిగా పొన్నబోయిన ఆంజనేయులు, కార్యదర్శులుగా వేల్పుల కోటేశ్వరరావు, కొనికి సుబ్బారావు, జొన్నలగడ్డ అబ్రహం, గంగోలు శ్రీనివాసరావు, వెలగాల శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనికి నాగమల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలుగా తెల్లమేకల భూలక్ష్మి, నలబోలు రామలక్ష్మమ్మ, కార్యవర్గ సభ్యులుగా కొనికి వెంకటేశ్వర్లు, సాపాటి రాజశేఖర్, పొత్తూరి వెంకటేశ్వర్లు, కొనికి రత్తయ్య, వేల్పుల సుధాకర్, వేల్పుల నాగరాజు, మేడిబోయున రాజేష్, యద్దనపూడి వీరాంజనేయులు, నర్రా తిరుపతిస్వామి నియమితులయ్యారు.

పోలేరమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు



పూజల్లో పాల్గొన్న మేరుగు నాగార్జున, నాయకులు

- పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: మండలంలోని గోనుగుంట గ్రామంలో పోలేరమ్మ తల్లికి పొంగళ్లు కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురవాలని గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఉప్పలపాటి వెంకటరావు, గ్రామాధ్యక్షుడు కందిమల్ల శ్రీనివాసరావు, కందిమల్ల శేషయ్య, అను రాంబాబు, పరిమి వెంకటరావు, దుంపా చెంచురెడ్డి, వాకా కోటిరెడ్డి, శ్రీమన్నారాయణ, నల్లూరి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సూదనగుంటకు అభినందనలు

ఒంగోలు మెట్రో: 40 మంది మహిళా నటులతో భక్త ప్రహ్లాద నాటకాన్ని రూపొందించి వారిచే సీవీఎన్ కళా ప్రాంగణంలో అద్భుతంగా నాటకాన్ని ప్రదర్శింపజేసిన ప్రముఖ నాటకరంగ దర్శకుడు సూదనగుంట వెంకటేశ్వర్లును సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ పాలకవర్గం ఆదివారం సన్మానించి అభినందించింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథరావు మాట్లాడుతూ నాటకరంగ చరిత్రలోనే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టి భారీ వ్యయంతో పౌరాణిక గాథను అత్యంత సహజ సిద్ధంగా మన కళ్లముందు ఉంచిన వెంకటేశ్వర్లు అభినందనీయుడని అన్నారు. క్లబ్ కార్యదర్శి కోడూరు రాధాకృష్ణ, సంస్థ అధ్యక్షురాలు శివకుమారి, క్లబ్ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి నితిన్ రాజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి తోట సాయి నవీన్, కోశాధికారి హారిక వీరప్రతాప్, కార్యవర్గ సభ్యులు ఉన్నం శేషుబాబు, కరేటి కిరణ్ బాబు, యామల బాలకృష్ణ, సీహెచ్ రామకృష్ణారావు, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, తోట శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ క్లబ్ పాలకవర్గ సభ్యులు

బాల విహార్ శిక్షణ తరగతులు ప్రారంభం

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో గోశాల భవనంలో బాల విహార్ శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు చిన్మయా మిషన్ నిర్వాహకుడు సత్యాత్మానంద స్వామీజీ పాల్గొని మాట్లాడారు. బాలబాలికల్లో చిన్నప్పటి నుంచే విజ్ఞానం పెంపొందించాలని సూచించారు. అందుకోసం ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్ అభినందనీయులని అన్నారు. బాల విహార్ శిక్షణ తరగతులతో విద్యార్థులలో సానుకూల దృక్పథం ఏర్పడటంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతాయని అన్నారు. శ్రీగిరి దేవస్థానం కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, చిన్మయ మిషన్కు చెందిన బ్రహ్మచారి హరీష్ చైతన్య, ఆలూరు జై శంకర్, శ్రీగిరి వేద పండితులు పి.భాను ప్రకాశశర్మ, శ్రీగిరి దేవస్థానం అర్చకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

వైభవంగా రాధాకృష్ణుల కళ్యాణం



మాంగల్యం చూపిస్తున్న అర్చకుడు



కళ్యాణంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు మరిచెట్లకాలనీలోని శ్రీ రాధాకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం రాధాకృష్ణుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. నిర్వాహకులు దేవస్థాన ఆవరణలో చూడచక్కని కళ్యాణ వేదిక ఏర్పాటు చేశారు. వేదికపై రాధాకృష్ణులను కొలువుదీర్చి భక్తుల హర్షధ్వానాల నడుమ కళ్యాణం జరిపించారు. ముందుగా దేవేరులను కంకణధారులను చేసి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. శుభముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టించి కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ, మాల మార్పిడిని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సంతనూతలపాడులో ఉట్టి కొట్టే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ వద్ద ఆలయ అర్చకులు శ్రీనివాసరావు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చుండూరి వెంకట కృష్ణయ్య, అనీల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నిలువునా మోసం.. చంద్రబాబు నైజం

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున



బాబు షూరిటీ - మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిపాడు: నిలువునా మోసం చేయడమే చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. మద్దిపాడు మండలంలోని అన్నంగి గ్రామంలో ఆదివారం సాయంత్రం బాబు షూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత ఆలోచనలకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు బలయ్యారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోగా, ఆగస్టు 15 నుంచి మహిళా శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ మరోమారు మోసం చేస్తున్నారన్నారు. కేవలం పల్లె వెలుగు బస్సులు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలోనే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లెవెలుగు బస్సులు కేవలం పదుల సంఖ్యలోనే ఉన్నాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని అన్ని రకాల బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలన్నారు. గతంలో మాదిరిగా పసుపు ఒకసారి ఇస్తాం.. కుంకుమ గెలిచిన తర్వాత ఇస్తామంటూ డ్రామాలాడటం చంద్రబాబుకు పద్ధతి కాదన్నారు. ఆయన రెండు నాలుకల ధోరణి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు ఇంకాస్త అర్థమయ్యేలా వివరించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. టీడీపీ మేనిఫెస్టోకి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను స్థానిక నాయకులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, నాయకులు తేళ్ల పుల్లారావు, దుద్దు వినోద్, పల్లపాటి అన్వేష్, మందా ప్రసాద్, రాయపాటి విల్సన్, నాదెండ్ల మహేష్, కావూరు ఏసోబు, గద్దె జాలయ్య, కంకణాల సురేష్, కుంచాల వెంకటేశ్వర్లు, గల్లా భానుచందర్, వేల్పుల సుబ్బారావు, వల్లపు నాగేశ్వరరావు, కేతమాల సుధాకర్, తిప్పగుడిసె కిషోర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నంగి గ్రామ కమిటీ ఎంపిక...

వైఎస్సార్ సీపీ అన్నంగి గ్రామ కమిటీని మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షునిగా రావిపాటి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా వల్లెపు నాగేశ్వరరావు, కేతమాల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సూదనగుంట హనుమంతరావు, తేళ్ల ఏసురత్నం ఎంపికయ్యారు.

సత్యసాయి సేవాసమితి రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

పెద్దదోర్నాల: సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని సత్యసాయి సేవా మందిరంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువకులు స్వచ్ఛందగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వర్షం పడితే రోడ్లు చెరువులే

- గొబ్బూరులో సైడు కాల్వలు లేక రోడ్డుపైనే నిలుస్తున్న వర్షం నీరు
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు



గొబ్బూరులో శివాలయానికి వెళ్లే సిమెంటు రోడ్డుపై మురుగు నీరు



మెయిన్ రోడ్డుపై ఇళ్ల మధ్య చెరువును తలపిస్తున్న వర్షం నీరు

పెద్దారవీడు: గొబ్బూరు గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్డుపై వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధాన వీధులు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఇళ్లల్లోకి వస్తున్నాయి. కొంత మంది నీరు ఇంటిలోకి వస్తున్నాయని ఇంటి ముందు ఎత్తుగా మట్టిని పోసుకున్నారు. ఇంటిలో నుంచి బయటికి అడుగు పెట్టాలంటే మోకాళ్లలోతు బురద నీటిలో నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిందంటే రోజుల తరబడి నీరు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు దుర్వాసనకు భోజనం చేయలేకపోతున్నామని, రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా, నడుచుకుంటూ వెళ్లాలన్నా కష్టంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. దోమల బెడదతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. దోమలు కుట్టడం వల్ల ఎటువటి రోగాల బారిన పడతామోనని భయందోళన చెందుతున్నారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని పాలకులు, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలు నిర్మించి మురుగు నీరు ఊరి చివరకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఏకలవ్య విగ్రహ నిర్మాణ కమిటీ ఏర్పాటు



సమావేశం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు ఏకలవ్యనగర్ (ఎస్టీకాలనీ)లో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేశారు. ఆదివారం కాలనీవాసులతో సమావేశం నిర్వహించి జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై విగ్రహం ఏర్పాటుపై చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పాలపర్తి యానాది, గౌరవాధ్యక్షునిగా డి.ఏడుకొండలు, ఉపాధ్యక్షునిగా కుంభా సుబ్బరాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్గా మొగిలి ఆంజనేయులు, కార్యదర్శిగా దేవరకొండ నాగశ్రీనును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎస్టీ ఉద్యోగుల జాతీయ నాయకుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లమోతు మోహనకుమార్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు పేరం సత్యం, ఎస్టీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కుంభా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.